# సంక్రాంతి

సంక్రాంతి రోజున సూర్యనారాయణుడు మకర రాశిలో ప్రవేశిస్తాడు. ఆ రోజునుంచే ఉత్తరాయణం ప్రారంభం. రాత్రి సమయం క్రమేపీ తగ్గి పగటి సమయం పెరుగుతూంటుంది. అంటే చీకటి నుంచి వెలుతురు వైపు సంక్రమణానికి స్ఫూర్తి నిచ్చేదే మకర సంక్రాంతి. అజ్ఞాన రూపమైన అంధకారం నుంచి ప్రకాశవంత మైన జ్ఞానం వైపు, హీనత్వం నుండి శ్రేష్ఠత్వం వైపు, అవమానం నుండి గౌరవం వైపు, నిరాశ నుంచి లక్ష్యం వైపు, ఇంకా అవగుణాలను వదలివేసి సద్గుణాల వైపు పయనించడానికి ప్రేరణ నిచ్చేదే మకర సంక్రాంతి. సమాజంలో పరస్పర అభిమానాన్ని కలుగజేసి, అన్ని రకాల భేద భావాలను వదలడంతో , ఏకాత్మ భావం సాక్షాత్కరింప చేసుకునే ఉదాత్తమైన సంస్కారాన్ని కల్గించేది ఈ రోజే.

మకర సంక్రాంతికి ప్రత్యేకత ఉన్నది. సూర్యుడు రాశి మారే ప్రతి సంక్రాంతికీ ప్రకృతిలో మార్పు అంత స్పష్టంగా గోచరించదు. కానీ మకరంలోకి సూర్యుడు ప్రవేశించగానే ప్రకృతిలో గుర్తింపదగిన ఒక మార్పు వస్తుంది. దక్షిణాయనం ఆరు నెలలు వాన, చలి, చీకటి ఎక్కువ. ఉత్తరాయణంలో చలి, చీకటి తగ్గి వేడి వెలుతురు పెరిగే కాలం. పంటలు ఇంటికి చేరి సమృద్ధిగా ఉంటుంది. సృష్టిలో మార్పు సహజం. అలాగే మానవ శరీరం కూడా ప్రతి క్షణం మారుతూనే ఉంటుంది. అల్లాంటప్పుడు సమాజంలో కూడా మార్పు అవసరం. మానవ జీవితం ఏకత్వం కాదు. సమాజంలో ఒకరి నొకరు ఆశ్రయించి బ్రతుకవలసిందే. సత్వ భావం ఉంటే, వ్యవహరించే తీరు వేరు. అంటే సమాజం నాది అనే భావన. పై పై మార్పులు సంభవించినా, పరంపర చెడదు. అదే ధర్మం. అది లేని నాడు అంతా స్వార్ధమే.

ఏ ధర్మ కార్య మయినా సమాజ హితంతో చెయ్యాలి. అది బాధ్యత కూడా. స్వార్ధ పరులూ, ధర్మ విచ్ఛిన్న శక్తులూ ఎప్పడూ ఉంటారు. కృతయుగం నుంచి ఇదే వరస. మహర్షులు, సాధు-సంతులు, పీఠాధిపతులు అందరూ కూడా కేవలం తపస్సు చేసుకుంటూ కూర్చో లేదు. లోక హితం కోసం యజ్ఞ- యాగాదులను నిర్వహించే వారు. తమ ప్రవచనాల ద్వారా సనాతన ధర్మాన్ని వ్యాప్తి చేస్తూనే ఉన్నారు. ధర్మ పరులు నిష్కామ కర్మ చేస్తే విడుదలయ్యే నిశ్చయమైన బలీయ శక్తి అరాచక శక్తులను అణచి వేస్తుంది. కరువు కాటకాలు లేకుండా, సకాలంలో కావలసినంత వర్షపాతంతో జనులు, పశు-పక్ష్యాదులు అంతా సుఖంగా జీవించ గలుగు

తారు.  ధార్మికమైన విషయాలు ఎవరో ఎవరికోసమో చెప్పారని కాకుండా తమ జీవితాలను తరచి చూసుకోవాలి. తాము  ఎంతవరకూ ధర్మ బద్ధంగా జీవించ గలుగు తున్నామో పరిశీలించు కోవాలి. తాము  ఆచరించని విషయాలను ఎదుటివారికి చెప్పే అర్హత లేదు. ఈ క్రమంలో అహం అడ్డురాకూడదు.  సమాజ హితం తరువాతే స్వ ప్రయోజనం. ఈ కోణంలో దేవాలయాలు, ధార్మిక సంస్థలు, విద్యా సంస్థలు శ్రద్ధా కేంద్రాలు కావాలి.  ఆ కార్యక్రమాలలో మమేకం కావాలి. తమను తాము మలచుకుంటూ అందరినీ సంఘటితం చెయ్యాలి. సంఘే శక్తిః కలౌ యుగే.

లోకాః  సమస్తా సుఖినో భవంతు.